www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 సెప్టెంబరు 2023

27న జంగారెడ్డిగూడెంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - ఏలూరు

జంగారెడ్డిగూడెం మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 27న బుధవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెం అశ్వారావుపేటరోడ్డులోని సరిత హాస్పటల్ దగ్గర శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఈ నెల 27వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల ప్రజలు తమ సమస్యలను తెలియజేసుకోవచ్చని తెలిపారు. దీనికి జిల్లా అధికారులంతా హాజరవుతారని పేర్కొన్నారు.

అంగన్వాడీలపై అమానుషం..!

జంగారెడ్డిగూడెంలో సుభాషిణిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించింది. తమ సమస్యలపై నినదించడమే తప్పన్నట్లు అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి ఉక్కుపాదం మోపింది. జీతాలు పెంచాలని, ఉద్యోగ విరమణ సదుపాయాలు కల్పించాలని, తల్లులు, పిల్లలకు సంబంధించి ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలన్న పలు సమస్యలపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చారు. అయితే అంగన్‌వాడీలను విజయవాడ నిరసన కార్యక్రమాలకు వెళ్లనీయకుండా ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరించింది. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును సైతం హరిస్తూ పోలీసులను రంగంలోకి దింపింది. అంగన్‌వాడీ నాయకులను గృహ నిర్బంధం చేయడం, బయటికి రాకూడదంటూ నోటీసులు జారీ చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంది.

- విజయవాడ వెళ్లకుండా ఎక్కడికక్కడే అరెస్టులు
- తెల్లవారుజాము నుంచే వాహనాలు అడ్డగించి పోలీస్ స్టేషన్లకు తరలింపు
- ప్రభుత్వ తీరుకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు, ర్యాలీలు
- నేడు మండల కేంద్రాల్లో నిరసనలకు కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి పైగా అంగన్‌వాడీలకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఇది చాలదన్నట్లు సోమవారం విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల వాహనాలను ఆపి ఎక్కడికక్కడే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకుని ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు అంగన్‌వాడీలను పెదపాడు పోలీస్‌స్టేషన్‌కు, దేవరపల్లి ప్రాంతానికి చెందిన వారిని పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన వారిని చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌కు, చింతలపూడి ప్రాంతానికి చెందిన వారిని నూజివీడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జంగారెడ్డిగూడెంలో బస్టాండ్ వద్ద పోలీసులు అంగన్‌వాడీలను అడ్డుకోవడంతో పెద్దఎత్తున ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వేలాది సంఖ్యలో అంగన్‌వాడీ ఉద్యోగులను ఎక్కడికక్కడే నిర్బంధించి ముందుకు సాగకుండా చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ల వద్దే అంగన్‌వాడీలు నిరసనల హోరు కొనసాగించారు. 'మాట తప్పిన సిఎం, మడమ తిప్పిన సిఎం' అంటూ నినాదాలు చేశారు. అంగన్‌వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్‌వాడీల అరెస్టులకు నిరసనగా సిఐటియు నాయకులు ఎక్కడికక్కడే ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించిన అంగన్‌వాడీలకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నేత పి.కిషోర్‌తోపాటు పలువురు ర్యాలీగా వెళ్లి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై నాయకులు మండిపడ్డారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులు, నిర్బంధాలకు దిగడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు నిరసనలకు కార్మిక సంఘాల పిలుపు

సమస్యలపై ఆందోళనకు దిగిన అంగన్‌వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలకు కార్మిక సంఘాలు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు పిలుపునిచ్చాయి. మంగళవారం అన్ని మండల కేంద్రాల్లోనూ మరోసారి అంగన్‌వాడీల నిరసనలు హోరెత్తనున్నాయి.

ఏలూరుఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను ఏలూరులో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఏలూరు వన్‌టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద ధర్నాలు, నగరంలో ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను టోల్‌గేట్ వద్ద అడ్డుకుని పోలీసులు వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు. దీనికి నిరసనగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు నేతృత్వంలో సిఐటియు జిల్లా కార్యాలయం నుండి రూరల్ పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ స్టేషన్ గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, సిఐటియు నాయకులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా లింగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మరోపక్క సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ నేతృత్వంలో తంగెళ్లమూడి నుండి ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిపిఎం నాయకులు ఎం.ఇస్సాక్, పశ్చిమగోదావరి జిల్లా అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.తులసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి మాట్లాడారు. హామీలు అమలు చేయమని గత నాలుగు సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న రీత్యా అంగన్వాడి కార్యకర్తలు చలో విజయవాడకు పిలుపునిచ్చారని అన్నారు. అంగన్వాడి కార్యకర్తలకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తణుకు, పెనుగొండ, సిద్ధాంతం, తూర్పుగోదావరి జిల్లా తుని, రావులపాలెం తదితర ప్రాంతాల నుండి విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను ఏలూరులో అరెస్టు చేసి పెదవేగి పోలీసు ట్రెయినింగ్ సెంటర్‌కు తరలిస్తుండగా సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ నేతృత్వంలో బస్సులను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీలను విడుదల చేశారు.

ఏలూరులో డివిఎన్‌విడి ప్రసాద్‌ను లాక్కెళ్తున్న పోలీసులు

మండవల్లిలో..

ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద

ద్వారకా తిరుమల: అంగన్వాడీలను ద్వారకాతిరుమల పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేశారు.

బుట్టాయిగూడెం: చలో విజయవాడకు వెళ్లొద్దని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

కుక్కునూరు: అంగన్వాడీలు, సిఐటియు నాయకుల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా కుక్కునూరు మెయిన్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కుంజా నాగలక్ష్మి, బాడిస సుజాత, పోచారపు వెంకటేశ్వర్లు, కణితి మంగ, వర్స మంగ, రాజేశ్వరి, పార్వతి పాల్గొన్నారు.

చింతలపూడి: బొర్రంపాలెం సెక్టార్ అంగన్వాడీలను చింతలపూడి పోలీసులు నిర్బంధించారు. దీన్ని నిరసిస్తూ సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, పట్టణాధ్యక్షులు సూర్యకుమార్ ఆధ్వర్యాన పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీల అరెస్టులను ఎఐటియుసి జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి బాబు ఒక ప్రకటనలో ఖండించారు

మండవల్లి: అంగన్వాడీలను పోలీసులు సోమవారం అడ్డుకున్నారు. దీంతో మండవల్లి ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షురాలు చెల్లాయమ్మ మాట్లాడగా నేతలు ఉమాదేవి, విజయలక్ష్మి, శ్రీదేవి, నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం: మండలంలో అంగన్వాడీలు విజయవాడ వెళ్లకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పిఎల్ఎస్.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల నుంచి బయలుదేరిన అంగన్వాడీలను నూజివీడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. దీనికి నిరసనగా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: చలో విజయవాడకు వెళ్లకుండా అంగన్వాడీలను అడ్డుకోవడం దారుణమని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోమవారం బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి వచ్చిన అంగన్వాడీలు విజయవాడ వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు ఎక్కగా పోలీసులు వారిని బలవంతంగా దించేశారు. దీంతో అంగన్వాడీలు బస్టాండ్‌లోనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై క్రిమినల్ కేసులు పెడతామని పోలీసులు బెదిరించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఉష రాజేశ్వరి, విజయకుమారి, సుబ్బలక్ష్మి, విజయనిర్మల, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం దుర్మార్గం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్రంలో అంగన్వాడీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం చేపట్టిన చలో విజయవాడ, మహాధర్నాను ప్రభుత్వం అప్రజాస్వామికంగా అడ్డుకోవడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ పోలవరం నియోజకవర్గస్థాయి వర్క్‌షాప్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంతెన సీతారాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అంగన్వాడీలు అనేక సమస్యలతో ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అంగన్వాడీలకు న్యాయమైన జీతాలు ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయకపోగా నేడు నిరసనలను అణచివేయడం దారుణమన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, అరెస్ట్ చేసిన అంగన్వాడీలను, నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఏజెన్సీ ప్రాంత సమస్యలను పరిష్కరించడంలో ఎంపీ, ఎంఎల్ఎలు విఫలమయ్యారని వారు విమర్శించారు. పోలవరం నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా తయారై ప్రజలు నానావస్థలు పడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రజానీకం నిత్యం ప్రయాణించే పట్టెన్నపాలెం వంతెన నిర్మాణ పనులు నిలిచి నాలుగేళ్లు గడిచినా ఈ పాలకులు వంతెన పునఃనిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. మండల కేంద్రం బుట్టాయగూడెంలో గత ప్రభుత్వం డిగ్రీ కళాశాల భవనం నిర్మాణం చేపట్టితే ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం శోచనీయమన్నారు. జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటు పనులు మానుకోవాలని, భూసేకరణ పనులు ఆపాలని అన్నారు. నియోజకవర్గంలో భూసమస్యలు అధికంగా ఉన్నాయిని, వీటిని పరిష్కరించడంలో పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధి లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజీ, పునరావాసం ఇప్పటికీ అందలేదన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు పెదవాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందించాలని, పంట కాల్వల్లో పూడిక తీసి ఆ ప్రాంత రైతాంగానికి నీరు ఇవ్వాలని కోరారు. బుట్టాయగూడెం మండలంలో పోగొండ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయాలన్నారు. ప్రధాన రహదారులతోపాటు కొండవాగులపై కల్వర్టుల నిర్మాణం తక్షణం చేపట్టాలన్నారు. నియోజకవర్గ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో రానున్న కాలంలో ఆందోళనలు చేపట్టనున్నామని వారు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి, జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, కె.శినివాస్, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, జివిఎల్.నరసింహారావు, మండల కార్యదర్శులు ఎస్.రాంబాబు, టి.సత్యనారాయణ, ధర్ముల రమేష్, ఆర్‌విఎస్.నారాయణ పాల్గొన్నారు.

లబ్ధిదారునికి మంజూరు పత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అర్జీల పరిష్కారంపై లబ్ధిదారుల సంతృప్తి

సంబంధిత పత్రాలు అందించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

'స్పందన-జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం అందించిన అర్జీల్లో తమ సమస్యలు సంతృప్తికరంగా పరిష్కరించారని పలువురు లబ్ధిదారులు తెలిపారు. పరిష్కారమైన అర్జీల్లో కొన్నింటిని ఆయా మండలాల నుంచి తెలుసుకునే నూతన ఒరవడికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయా లబ్ధిదారులు దరఖాస్తు చేసిన వాటికి సంబంధించిన పత్రాలను కలెక్టర్ వారికి అందజేశారు. భీమడోలుకు చెందిన కడగల వరలక్ష్మికి ఇంటి స్థల పట్టాను, దెందులూరు మండలం కొత్తగూడేనికి చెందిన వంజరపు ప్రసాద్‌కు విభిన్నప్రతిభావంతుల పెన్షన్ మంజూరు పత్రాన్ని, పెదవేగి మండలం బాపిరాజుగూడేనికి చెందిన భీమడోలు ప్రవీణ్‌కు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల్లో సక్రమంగా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించిన అర్జీల్లో ప్రతి మండలం నుంచి ప్రతి సోమవారం మూడు ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీటిని ఏలూరులో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఆయా లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను అందజేస్తామన్నారు. ఇదే తరహాలో డివిజన్‌స్థాయిలో కూడా నిర్వహించాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు మండల స్థాయిలో తమ అధికారు లతో స్పందన అర్జీలు సంతృప్తికరస్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ఏలూరు రామచంద్రరావుపేటకు చెందిన వైవిఆర్‌సిహెచ్.సోమయాజులు తన ఇంటి పన్ను ఎసెస్‌మెంట్ చేయాలని అర్జీ అందించగా దీనిపై నగరపాలక మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఇంటిపన్ను ఎస్‌ఎస్‌మెంట్ చేసిన తీరుపై అర్జీదారుడు సోమయాజులు సంతృప్తి వ్యక్తం చేశారు.

396 అర్జీలు రాక: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

స్పందనలో అందిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పరిష్కార తీరు నాణ్యంగా ఉండాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, డిపిఒ టి.విశ్వనాథ్‌శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి రమణ అర్జీలను స్వీకరించారు. సోమవారం 396 అర్జీలు అందాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు నాణ్యతతో పూర్తిస్థాయి పరిష్కారం చూపాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్-ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీదారులు దరఖాస్తు చేసుకున్న విధంగా ఆ సమస్య పరిష్కారమవుతున్నదీ లేనిదీ సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతిరోజూ స్పందన లాగిన్‌ను చూసి వాటి సంఖ్య తగ్గేలా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

మోకాళ్లపై నిల్చొని ఉపాధ్యాయ నేతల నిరసన

జిపిఎస్ వద్దు.. ఒపిఎస్‌నే కావాలి

ఫ్యాప్టో ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఉపయోగపడదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. 'జిపిఎస్ వద్దు-ఒపిఎస్ ముద్దు' నినాదంతో చేపట్టిన ఈ ధర్నాలో ఫ్యాప్టో ఏలూరు జిల్లా ఛైర్మన్ పి.నారాయణ, సెక్రటరీ జనరల్ గుడిమెల్లి వెంకటేశ్వరరావు, కోఛైర్మన్లు ఆదినారాయణ, జిలాని, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రవికుమార్, రంగావలీ, గుగ్గులోతు కృష్ణ పాల్గొన్నారు. సుమారు 500 మందికిపైగా ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు జిపిఎస్ పేరుతో ఉద్యోగులను మోసగిస్తున్నారని విమర్శించారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

పార్వతి ట్రస్టు సేవలు అభినందనీయం

కాగుపాడులో విద్యార్థులకు ప్రోత్సాహకాలు

చంద్రయాన్, ప్రజల్లో మూఢనమ్మకాలపై సెమినార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాగుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని సర్పంచి కడియాల సుదేష్ణ అన్నారు. పెట్ల పార్వతి 16వ వర్ధంతి సందర్భంగా సోమవారం కాగుపాడు పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, చంద్రయాన్-మూఢ నమ్మకాలపై సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఎం.ఉమాదేవి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలను ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను పాఠశాల లైబ్రరికి అందించారు. చంద్రయాన్-మూఢనమ్మకాలపై సెమినార్, మేజిక్‌షోలను జనవిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించి విద్యార్థులను ఉత్తేజపరిచారు. పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. చంద్రయాన్ ప్రయోగాల వివరాలను సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. ప్రముఖ శాస్త్రవేత్త సతీష్‌థావన్ 103వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, పిహెచ్‌సి వైద్యాధికారి పి.మానస, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు పత్తి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి ఎ.దేవేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేత

30న విభిన్న ప్రతిభావంతులకు జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

ఎపి ప్రభుత్వం నైపుణ్యం, వృత్తి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యావంతులైన విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తోందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, ఏదేని డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన విభిన్న ప్రతిభావంతులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతోపాటు రెండు సెట్లు జిరాక్సు కాపీలు, రెండు ఫొటోలతో ఈ నెల 30న ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని కోరారు.

8 అడుగుల కొండ చిలువ హతం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గోపీనాథపట్నం (పట్నంపాడు) ఆంజనేయస్వామి గుడి సమీపంలో సుమారు ఎనిమిది అడుగుల కొండ చిలువను స్థానికులు సోమవారం రాత్రి హతమార్చారు. స్థానిక పామాయిల్ తోటలోంచి కొండచిలువ ఇళ్లలోకి ప్రవేశిస్తున్న సమయంలో స్థానికులు అప్రమత్తమై పామును చంపారు. ఇంతటి పెద్ద పామును చూడటం ఇదే మొదటిసారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.

ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యాన రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ప్రతి రైతుకూ రూ.2 లక్షలు మాఫీ చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని నినదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ నష్టాలతో అన్నదాతలు అప్పుల ఊబిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో కార్పొరేట్ కంపెనీలకు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని చెప్పారు. కష్టపడి పంటలు పండిస్తూ దేశానికి తిండి గింజలు అందిస్తున్న అన్నదాతలకు పైసా కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.23 వేలు ధర ఉంటే ప్రస్తుతం రూ.12,900కు పడిపోయిందన్నారు. టన్ను గెలలకు రూ.18 వేలు ధర ఇవ్వాలని కోరారు. పంటల బీమా పథకాన్ని ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని కోరారు. పంటల బీమాపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 660ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా పంటల బీమా అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల నాయకులు పూనెం దుర్గారావు, చెన్ను దుర్గారావు, ఎం.గంగరాజు పాల్గొన్నారు.

నినదిస్తున్న రైతు నేతలు

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అధ్వానంగా ఉన్న మండలంలోని కన్నాయిగూడెం నుంచి పొంగుటూరు రహదారికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. రోడ్లన్నీ గతుకులమయం శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రీన్ ఫీల్డ్ అధికారులు రోడ్డుపై గతుకులను గ్రావెల్‌తో పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ మరమ్మతులు ప్రస్తుతానికి ఉపశమనమని, రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు నుంచి పొంగుటూరు వరకు కొత్త రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు భూములు పంచాలని వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలో ఉన్న సీలింగ్, అసైన్డ్, అన్యాక్రాంతమైన భూములను పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆగిరిపల్లి మండల నాయకులు సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నూగొండపల్లి, ఈదర, గొల్లగూడెం, ఎస్‌ఎ.పేట, తోటపల్లి, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో ఉన్న మిగులు భూములను పేదలకు పంచాలని, నూగొండపల్లిలో ఆర్ఎస్ నెంబర్ 122/1లో య.0.68 సెంట్ల భూమిని అన్యాక్రాంతం కాకుండా రక్షించి సదరు భూమిని నివేశన స్థలాల కోసం పేదలకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, బాషా, సుభాకరరావు పాల్గొన్నారు.

29న చలో విజయవాడ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళితుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 29వ తేదీన నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో చలో విజయవాడ ధర్నా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఎ.రవి, పి.రామకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు, జస్టిస్ పున్నయ్య సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 29న చలో విజయవాడ ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆవిష్కరణలో సంఘం మండల కార్యదర్శి అందుకుల ప్రభాకరరావు, కె.సుబ్బారావు, బి.నాని, కె.సునీల్, ఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాతృభూమి గొప్పతనాన్ని స్మరించుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

జీవితంలోని ప్రతి క్షణం మాతృభూమి కోసం పరితపించాలని కాట్రేనిపాడు పంచాయతీ హరిచంద్రపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరీ మట్టి - మేరా భారత్ కార్యక్రమాన్ని పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జాతీయ నాయకుల త్యాగాలను, వారు చేసిన విశేషమైన కృషిని, మాతృ భూమి గొప్పతనాన్ని జీవితాంతం స్మరించుకోవాలని ఆమె తెలిపారు.

అధికారులు పర్యవేక్షించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సీడ్ మొక్కజొన్న కంపెనీలపై అధికారుల పర్యవేక్షణ కొనసాగించాలని ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ కోరారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు.

శ్రీవారికి బంగారు కొబ్బరిచిప్పలు బహూకరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఒక భక్తుడు తలంబ్రాలు పోసే బంగారు కొబ్బరి చిప్పలు బహుకరించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పొలమూరుకు చెందిన కురపాటి వెంకటమంగారావు తలంబ్రాలు పోసే బంగారు కొబ్బరి చిప్పలు ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావుకు కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు సమక్షంలో సోమవారం అందించారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కురెళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విజిలెన్స్ కమిటీ సభ్యులు కోనే వీరవెంకటసత్యనారాయణ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన పథకం సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పిల్లలకు అందించే భోజనం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వంట చేసే ప్రదేశంలో పెరిగిన గడ్డి మొక్కలను తొలగించాలని సూచించారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్పులపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి మెరిట్ సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల చొప్పున నాలుగేళ్ల పాటు నగదు చెల్లిస్తామని ప్రాజెక్టు మేనేజర్ వరహాలు తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్ వారితో స్కాలర్‌షిప్పులపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన బాలాజీ (37) నిర్మాణంలో ఉన్న తన ఇంటికి వాటరింగ్ చేసేందుకు సోమవారం మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కుటుంబ కలహాలతో వివాహిత కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన నూజివీడు మండలంలోని సుంకొల్లు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన వివాహిత ఎవి.రమణ కుటుంబ కలహాలతో సోమవారం కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను వెంటనే నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూద శిబిరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరికి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిగవల్లి గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్ఐ తలారి రామకృష్ణ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,250 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చింతలపూడి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ సుంకర సాయి స్వరూప్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ సాయిస్వరూప్ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో వ్యక్తిని అరెస్టు చేసి సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిత్యావసర సరుకుల ధరలు, సమస్యలపై పోరాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

నిత్యావసర సరుకుల ధరలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, స్థానిక సమస్యలపై పార్టీ శాఖలు ఎక్కడికక్కడ ఆందోళనలు పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల నుంచి స్థానిక పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం కార్యకర్తల శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణా తరగతులకు సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జిల్లాలోని రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పాడైపోయాయన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రోడ్డుపై వస్తున్న దుమ్ము వల్ల ప్రజలు ఊపిరితిత్తులకు సంబంధించిన రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వైరల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన మందులు, డాక్టర్లు లేక ప్రజల వైద్యానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సేవలు రద్దు చేయడం వల్ల ప్రజలకు ఉచిత వైద్య సేవలు సక్రమంగా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత తీవ్రం గా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మొబైల్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మందులను, సిబ్బందిని, డాక్టర్లను కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. దోమల నివారణకు మున్సిపల్, పంచాయతీ అధికారులు ఏ చర్యలు తీసుకోవడంలేదన్నారు. విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిపిఎం కార్యకర్తలుగా ఎక్కడికక్కడ ప్రజా సమస్యలు, స్థానిక సమస్యలపై పోరాటాలు, ఆందోళనలు నిర్వహించాలని, అధికారులకు, ప్రభుత్వానికి అర్జీలు పెట్టాలని రవి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల శాఖ కార్యదర్శులందరూ పాల్గొన్నారు.

చట్ట ప్రకారం గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి - మండవల్లి

చట్ట ప్రకారం గ్రామ సభలను నిర్వహించి గ్రామాభివృద్ధికి, ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఆచరణ రూపం తీసుకురావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి నిర్వహించే గ్రామ సభలను పంచాయతీరాజ్ చట్టం సూచించిన రీతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒ టికె.వెంకటరమణ, తహశీల్దార్ కె.రాజకుమార్లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామసభల్లో అన్ని శాఖల అధికారులతో పాటు వార్డు మెంబర్లు, వాలంటీర్లు పూర్తిస్థాయిలో పాల్గొనడం లేదన్నారు. అధికారులు హాజరుకాని గ్రామ సభల వల్ల ప్రయోజనం ఏంటని ప్రజలు గ్రామసభలో పాల్గొనేందుకు ఇష్టపడడం లేదన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఒకేసారి ఒకేరోజు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామసభల నిర్వహణ మొత్తాన్ని ఆడియో వీడియో తీసి ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా గ్రామసభ జరుగుతున్న విధానం తెలుస్తుందన్నారు. ఆ విధంగా ఎక్కడా కూడా అధికారులు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేలా ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల బాధ్యులు అప్పారావు, ప్రధాన కార్యదర్శి బండి రంగారావు, పొన్నూరు రామచంద్రరావు, కె.సూర్యారావు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు టిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలవరం గ్రామపంచాయతీ సచివాలయం-2 పరిధిలో కమ్మరగుడెంలో యువతకు వైసిపి యువ నాయకుడు పొడుం శ్యామ్‌కుమార్ సోమవారం వాలీబాల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఈదేపల్లి వెంకటగణేష్, పోలవరం సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత : మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు సోమవారం పర్యవేక్షించారు. స్థానిక 50వ డివిజన్ ఎంఆర్‌సి కాలనీలో ఆరు సచివాలయాల పరిధిలోని కార్పొరేటర్లతో కలిసి ఎఎన్ఎంలు సచివాలయ సిబ్బందితో పాటు మేయర్ నూర్జహాన్ పెదబాబు గడపగడపకు వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె బిపి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నున్న స్వాతి, శ్రీదేవి, కిషోర్, దేవరకొండ శ్రీను, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధా, డివిజన్ ప్రెసిడెంట్ గవరపేట నాయుడు, మానుకొండ శ్రీను, పిల్ల శివ, పెదపూడి రాజు, కుర్మా రాజు, శ్రీను, ఎం.కుమారి పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు కోసేటప్పుడు సమాచారం అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ గెలలు కోసేటప్పుడు రైతులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలని చింతలపూడి విద్యుత్ శాఖ ఎఇ వెంకయ్య సూచించారు. పట్టణంలోని సెక్షన్ కార్యాలయం వద్ద పామాయిల్ రైతులకు విద్యుత్ ప్రమాదాలపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ పామాయిల్ గెలలు కోసేటప్పుడు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వకపోవటంతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రాణహాని జరగకుండా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఉద్యానవన శాఖాధికారి ఎమ్‌డి షాపియా పర్వేన్ మాట్లాడుతూ పామాయిల్ గెలలు కోసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్‌శాఖా ధికారులకు సమాచారం ఇస్తే వారు తగు చర్యలు తీసుకుంటారని, తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ మీనాకుమారి, వైస్ ఎంపిపి వరలక్ష్మి పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఆయిల్ పామ్ గెలలు కోసేటప్పుడు రైతులు, గెలలు కోసే కార్మికులు సైతం అప్రమత్తంగా వ్యవహరించాలని కామవరపుకోట ట్రాన్స్ కో ఎఇ డి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సహకార సంఘం గిడ్డంగి వద్ద సోమవారం పామాయిల్ రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎడి మాట్లాడుతూ గెలలు కోసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, రైతు ప్రతినిధులు దేవరపల్లి అజాద్, పెద్దిన ప్రసాద్, మాజీ సర్పంచి జోనబోయిన సోంబాబు, మాజీ వైస్ ఎంపిపి అద్దంకి జగ్గారావు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల స్థాయిలో కల్యాణ్‌బాబుకు పతకం

పోలవరం :అంతర్ జిల్లాల అండర్-17 బాలుర విభాగంలో రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోపాల కల్యాణ్‌బాబు కాంస్య పతకాన్ని సాధించాడు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ నున్నా విద్యాసంస్థల ఆవరణలో నున్నా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ 17 బాలుర విభాగంలో రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. కాంస్య పతకాన్ని సాధించిన కల్యాణ్‌బాబును పాఠశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. ఇన్‌ఛార్జి ఎంఇఒ, ప్రధానోపాధ్యాయురాలు ఎల్.మణి మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించడం హర్షణీయమన్నారు.

సమస్యలు పరిష్కరించాలని క్లాప్ ఆటో డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ క్లాప్ ఆటోల డ్రైవర్ల జీతాల్లో అక్రమంగా కోతలు కోసిన డబ్బులు తిరిగి జమ చేయాలని, యాజమాన్యం వేధింపులు ఆపాలని, ఎలాంటి కారణం లేకుండా అక్రమంగా తొలగించిన డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని క్లాప్ ఆటోల డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 కనీస వేతనం, ఇతర చట్టబద్ధ రాయితీలు అమలు చేయాలని నేడు క్లాప్ ఆటోల డ్రైవర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. అక్రమంగా తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని, జీతాల్లో కోతలు కోసిన డబ్బులు తిరిగి జమ చేయాలని వారు నినదించారు. స్థానిక వంగాయగూడెం వెహికల్ డిపో వద్ద టెంట్ వేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ యాజమాన్యం కక్షపూరిత ధోరణి వీడి క్లాప్ ఆటోల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పె.గోపీ, నగర ప్రధాన కార్యదర్శి రవీంద్ర సంఘీభావం తెలిపారు.

50 శాతం రాయితీతో గొర్రెలు, మేకల యూనిట్లు

ఏలూరు :జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి కల్పించేందుకు 50 శాతం రాయితీతో గొర్రెలు, మేకల యూనిట్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌లో 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల వరకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా రూ.50 లక్షల వరకు యూనిట్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గరిష్టంగా రాయితీ రూ.25 లక్షల వరకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పందుల పెంపకానికి సంబంధించి రూ.60 లక్షల వరకు యూనిట్ మంజూరు, గరిష్టంగా రూ.30 లక్షల వరకు రాయతీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పశుగ్రాసం, దాణా అభివృద్ధిలో భాగంగా సైలేజీ తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వీటికి రూ.కోటి వరకు అందిస్తామన్నారు. గరిష్టంగా రాయితీ రూ.50 లక్షల వరకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పోరాడాలి

బుట్టాయగూడెం :సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పోరాడాలని పలువురు అన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ 151వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం కుల నిర్మూలన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ధర్మల సురేష్ మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఉన్న కుల వ్యవస్థను రూపు మాపాలని, కుల అడ్డు గోడలు తొలగించాలని, దళిత, ఆదివాసీ, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఎందరో మహానుభావులు పోరాడారన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు తగరం బాబూరావు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూషణం, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు వి.భారతి మాట్లాడారు. పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నే వినోద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గుజ్జు రమేష్, బోడిగ నాగు, మామిడి మురళి, కోరం భీమన్న, కరకాల ప్రతాపరెడ్డి, పోలోజి శ్రీనివాసరావు, కె.రామిరెడ్డి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బాలల సంరక్షణ అందరి బాధ్యతని నవజీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ డి.రజిత చెప్పారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరు అశోక్ నగర్‌లోని రాజీవ్ గాంధీ పార్కులో డ్వాక్రా మహిళలకు బాలల పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ బాలలకు రక్షణగా ఉండాలన్నారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్, బి.నేహేమియ, కమ్యూనిటీ ఆర్గనైజర్ జి.రాజేశ్వరి, రిసోర్స్‌పర్సన్ చాప్లిన్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ముసునూరు

చంద్రబాబు అరెస్టుపై నిరసనగా సోమవారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో గద్దె రఘుబాబు, కొల్లి గంగరామ్, గద్దల మోహనరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, లక్కపం కాంతారావు, గార్లపాటి నరసింహరావు, మల్లిబాబు, సురేపల్లి గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టుపై న్యాయానికి కళ్లు లేవని పోస్ట్ కార్డు ఉద్యమం మొదలు పెట్టినట్లు రాష్ట్ర తెలుగ యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని గుడిపాడులో 400 కుటుంబాలతో పోస్ట్ కార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

కొయ్యలగూడెం : చంద్రబాబుకు అరెస్టుకు నిరసనగా కొయ్యలగూడెంలో టిడిపి నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలో నిరసనలో సోమవారం వాణిజ్య విభాగ నాయకులు పాల్గొన్నారు. టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీను పాల్గొని సంఘీభావం తెలిపారు.

కలిదిండి : చంద్రబాబుకు మద్దతుగా బాబుతో నేను కరపత్రాలను ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించినట్లు టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి కైకలూరు నియోజకవర్గ నాయకులు కొడాలి వినోద్ మాట్లాడారు.

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని అల్లూరులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు ఆధ్వర్యంలో శ్రీగంగాభవాని ఆలయం వద్ద టిడిపి నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. చలసాని లక్ష్మీపార్వతి, బలరాజు, సన్యాసిరావు, ఫణి, మహేష్, సత్యనారాయణ, వెంకన్న శ్యామ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు అరెస్టు ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం పట్టణ, మండల టిడిపి కమిటీల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి పాతూరి అంబేద్కర్, ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి గంటా శ్రీను సంఘీభావం తెలిపారు.

మహారాజశ్రీ తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 68/2023

Between:
కొల్లే సుబ్బలక్ష్మి -వాది
మరియు
కుచ్చర్లపాటి పెద్దిరాజు -ప్రతివాది

ప్రతివాది:
కుచ్చర్లపాటి పెద్దిరాజు, తండ్రి: సీమోను, హిందూ, పురుషుడు, ఇంటి నెంబరు: 4-135/1, కరెంటు ఆఫీసు దగ్గర, యాల్లవాని గరువు, పాలకొల్లు, పాలకొల్లు మండలం.

పై నంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్నిమార్లు దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా అందుకుని యుండుటలేదు. కాబట్టి పై కోర్టు వారి ఎదుట **దీ. 10-10-2023 ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి పై దావా నందు మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

G.V.V.APPAJI, Advocate
తణుకు — వాది తరపు న్యాయవాది
ది.23-9-23 — Relangi, Cell: 9948809596

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 25/2022

బిట్వీన్:
1. పర్వతం జానకి, వగైరాలు -వాద్యులు
మరియు
1. పర్వతం సత్యనారాయణ, వగైరాలు -ప్రతివాద్యులు

టు:
పర్వతం ఉదయరత్నం, భర్త: సత్యనారాయణ, డోర్ నెం. 1-60, కోనాల గ్రామం, తణుకు మండలం. **-2వ ప్రతివాది**

వాది తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథంలో 2వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిస్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించినను, అవి మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 04-10-2023వ సం॥రం తేదీన ఉదయం 10.30 గం॥ ని॥లకు** హాజరు కావలెను. మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఇవటూరి కిషోర్
తణుకు — వాది తరపు అడ్వకేట్
తేది:20-9-2023 — సెల్: 9848544550

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, ఏలూరు
O.S. No. 504/2020

Between:
వాదులు:
1. Smt. Medapati Surya Prabhavathi
2. Sri. Medapati Sudhakar Reddy
3. Sri. Medapati Sivaramakrishna Reddy
...*Plaintiffs*

ప్రతివాదులు:
1. Smt. Makanaboina Lakshmi
2. Vijayalakshmi Constructions, Eluru Rep. by Pedapudi Jeeva Prakasa Rao.
3. Sri. Pedapudi Jeeva Prakasa Rao
4. Smt. Nalluri Vijayakumari
...*Respondents*

Makanaboina Lakshmi, W/o. Nageswara Rao, House wife, R/o. D.No. 24A-11-2, Ashok Nagar, Eluru, W.G.Dt.,

ఆర్డరు-5, రూల్-20 సిపిసి ప్రకారం దాఖలు చేసిన పేపరు ప్రకటన పై నెంబరు దావాలో ప్రతివాదులకు సమన్లు ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావా నోటీసు అమలు జరుగనందున **ది. 05-10-2023వ తేదీకి కోర్టు వారు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** ప్రతివాదులు ప్రత్యక్షంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలసిందిగాను, లేనియెడల ప్రతివాదులు పరోక్షంలో దావా తీర్మానం కాబడునని తెలియజేయడమైనది.

బి.గౌరీశంకర్
ఏలూరు — **ఎ.వి.ఎస్.సూర్యారావు**, అడ్వకేట్స్
ది.25-9-23 — ఏలూరు, ప॥గో॥జిల్లా

దస్తావేజులు పడిపోయినవి

అలిగి కిరణ్, తండ్రి: అలిగి ప్రసాద్ (లేటు). మా తండ్రి గారైన అలిగి ప్రసాద్ (లేటు) గారి పేరు మీద డాక్యుమెంట్ పడిపోయినవి. **డాక్యుమెంట్ నెంబర్: 826/2008** గల డాక్యుమెంట్ 10-09-2023న పాలకొల్లు నుండి దొడ్డిపట్ల బైక్‌పై వెళుతుండగా మార్గ మధ్యంలో మా యొక్క డాక్యుమెంట్ పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: **అలిగి కిరణ్**
తండ్రి: అలిగి ప్రసాద్, వినాయక టెంపుల్ స్ట్రీట్ హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు
ప॥గో॥జిల్లా, సెల్: 9866239380

వేలం ప్రకటన
మహారాజశ్రీ 1st అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
E.P. 435/2020, O.S. 15/2013

Between:
శ్రీ అల్లూరి శ్రీనివాసరావు ...*DHR*
AND
శ్రీమతి మునుకొండ జానకి ...*JDR*

పై నెంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు కొరకు JDR యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములో ఉన్న ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 10-10-2023న ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము

ప॥గో॥జిల్లా, అనంతపల్లి సబ్ రిజిష్టరీ, నల్లజర్ల మండలము, నల్లజర్ల గ్రామం యిలాకాలో గల JDR సంపూర్ణ హక్కుభుక్తములలో గల R.S. No. 955/3, R.S. No. 955/3A మరియు R.S. No. 955/3B దాఖలా ఎకరం 1-06 సెంట్లు మెరక భూమి ఈ క్రింది హద్దుల మధ్య:
తూర్పు: అన్నమరెడ్డి లక్ష్మణరావు గారి భూమి.
దక్షిణం: మానుకొండ రామచంద్రరావు గారి భూమి.
పడమర: పుంత
ఉత్తరం: పావులూరి వెంకటేశ్వరరావు గారి భూమి.
ఈ హద్దుల మధ్య ఎకరం 1-06 సెంట్లు మెరక భూమి దానికి గల అన్ని ఈజుమెంటు హక్కులతో సహా వేలం వేయబడును.

DHR విలువ: రూ. 10,00,000/-
అమీనా విలువ: రూ. 22,00,000/-

ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
కె.రవికుమార్
ఏలూరు — అడ్వకేట్స్, ఏలూరు
25-9-23 — సెల్: 9491089199

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు
ఐ.ఎ. నెం. 7/2020
ఒ.ఎస్. నెం. 49/2019

భావనా విశ్వనాధ్ -పిటీషనరు/వాది
మరియు
ప్రతివాదులు:
1. శ్రీ చావా రామకృష్ణారావు (డైడ్) మరియు
2. శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా -రెస్పాండెంట్లు

ప్రపోజ్‌డ్ పార్టీ:
శ్రీ చావా గోకుల్

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయినందున వారికి దత్త పుత్రునిగా చెప్పుకొంటున్న శ్రీ చావా గోకుల్ గారిని దావాలో 44వ ప్రతివాదిగా చేర్చమని కోరుతూ వాది పై నెంబరు పిటీషనరు దాఖలు చేసినారు. సదరు పిటీషనులో ఈ క్రింది రెస్పాండెంట్లకు నోటీసు నిమిత్తం **ది. 13-10-2023వ తేదీ వాయిదా అయివున్నది.**

ఆర్-4: శ్రీమతి చలపాటి భవిత
ఆర్-5: శ్రీ చలపాటి గోపీకృష్ణ దర్శిత్
ఆర్-6: శ్రీ చలపాటి హర్షిత్
ఆర్-7: శ్రీమతి పైనేని ఉమాదేవి
ఆర్-12: శ్రీమతి పెనుమర్తి విజయలక్ష్మి
ఆర్-19: శ్రీ పిచ్చికల సూరిబాబు
ఆర్-22: శ్రీ చావా రామకృష్ణారావు
ఆర్-23: శ్రీ చావా వెంకటేశ్వరరావు
ఆర్-27: శ్రీ చావా సాయిరామకృష్ణారావు
ఆర్-28: శ్రీమతి చావా కిరణ్మయి
ఆర్-31: శ్రీ సత్తి నాగిరెడ్డి
ఆర్-38: శ్రీ ఉప్పల భువన ఆదిత్యకుమార్
ఆర్-39: శ్రీ కొండ్రెడ్డి శ్రీకాంత్
ఆర్-40: శ్రీ చాగంటి కనకదుర్గ
ఆర్-41: శ్రీ శింగవరపు భగత్‌సింగ్

పైన పేర్కొన్న రెస్పాండెంట్లు **ది. 13-10-2023వ తేదీ పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున పిటీషను తీర్మానం జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు — **ఎస్.వి.ఆర్.గాంధీ**
తేదీ:22-9-2023 — వాది తరపున అడ్వకేట్

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు
ఒ.ఎస్. నెం. 49/2019

భావనా విశ్వనాధ్ -వాది
మరియు
1. శ్రీ చావా రామకృష్ణారావు (డైడ్) మరియు
2. శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా -ప్రతివాదులు

పై నెంబరు దావాను వాది దావా ఆస్తులు పార్టిషను చేయమని కోరుతూ దాఖలు చేసినారు. సదరు దావాలో ఈ క్రింది ప్రతివాదులకు సమన్లు అమలు నిమిత్తం దావా **ది. 13-10-2023వ తేదీ వాయిదా అయివున్నది.**

డి-4: శ్రీమతి చలపాటి భవిత
డి-5: శ్రీ చలపాటి గోపీకృష్ణ దర్శిత్
డి-6: శ్రీ చలపాటి హర్షిత్
(మైనర్ రిప్రజంటెడ్ బై డి-6 చలపాటి భవిత)
డి-7: శ్రీమతి పైనేని ఉమాదేవి
డి-12: శ్రీమతి పెనుమర్తి విజయలక్ష్మి
డి-19: శ్రీ పిచ్చికల సూరిబాబు
డి-22: శ్రీ చావా రామకృష్ణారావు
డి-23: శ్రీ చావా వెంకటేశ్వరరావు
డి-27: శ్రీ చావా సాయిరామకృష్ణారావు
డి-28: శ్రీమతి చావా కిరణ్మయి
డి-31: శ్రీ సత్తి నాగిరెడ్డి
డి-38: శ్రీ ఉప్పల భువన ఆదిత్యకుమార్
డి-39: శ్రీ కొండ్రెడ్డి శ్రీకాంత్
డి-40: శ్రీ చాగంటి కనకదుర్గ
డి-41: శ్రీ శింగవరపు భగత్‌సింగ్

పైన పేర్కొన్న ప్రతివాదులు **ది. 13-10-2023వ తేదీ పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున పిటీషను తీర్మానం జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు — **ఎస్.వి.ఆర్.గాంధీ**
తేదీ:22-9-2023 — వాది తరపున అడ్వకేట్